క్లుప్తంగా

11న ఇస్కాన్‌లో రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ ఆలయంలో 11వ తేదీన రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తెల్లవారు జామున 4గంటలకు మంగళహారతి, 7 గంటలకు దర్శన హారతి, 9 గంటల నుంచి హరినామ సంకీర్తనలు, 11 గంటలకు పంచామృతాభిషేకాలు అనంతరం రాధాకృష్ణుని లీలలపై ప్రత్యేక ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

జూడో పోటీలకు శొంఠ్యాం బాలికలు

తగరపువలస: చెన్నైలో మంగళవారం నుంచి 13 వరకు జరగనున్న జూడో పోటీలకు ఆనందపురం మండలం శొంఠ్యాం వెంకటేశ్వర విద్యాపీఠ్ బాలికలు పాల్గొననున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఆదివారం బయలుదేరివెళ్లారు. ఇటీవల రాష్ట్ర జూడో సంఘం ఎంపిక కమిటీ చైర్మన్ పాండ్రంకి రుఖ్మాకరరావు నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేసిన బాలికలు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వీరిని పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు.

హాల్‌టికెట్ల పంపిణీ

తగరపువలస: ఈ నెల 14,15వ తేదీలలో నిర్వహించనున్న దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై పరీక్షలకు పాల్గొనే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఆదివారం భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి హాల్‌టికెట్లు పంపిణీ చేసింది. మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు, అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు హాల్ టికెట్లను విద్యార్థులకు అందించారు. అనంతరం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన 20 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ పోటీలు తెలుగు, హిందీ మాధ్యమాలలో నిర్వహించారు.

కళాధరరావుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కళాధరరావు

మధురవాడ: మధురవాడకు చెందిన ప్రముఖ యోగా మాస్టర్ కళాధర రావుకు మరో గౌరవం దక్కింది. ఇటీవలే 60 ఏళ్ల వయస్సులో 60 నిమిషాల్లో 60 యోగాసనాలు వేసి గ్లోబల్ వరల్డ్ రికార్డు అందుకున్నాడు. తాజాగా సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ హానరిస్ కాస్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విశ్వ యువక్ కేంద్రలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ అవార్డ్-2024, గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.

పీఎం పాలెం సీఐగా ప్రకాష్



పీఎం పాలెం: స్థానిక నేరవిభాగం సీఐగా బీఎస్ఎస్ ప్రకాష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.విజయనగరం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

వర్ష బీభత్సం



సంగివలస సర్వీస్ రోడ్డులో వర్షం నీటిలో వాహనదారుల అవస్థలు

- రహదారులపై చేరిన వర్షం నీరు
- జనజీవనం అస్తవ్యస్తం
- ముంపులో సంగివలస
- కోతకు గురైన బీచ్



సంగివలస సర్వీస్‌రోడ్డు వర్షంనీరు



వుడా మైదానం సమీపంలో తగరపువలసకు వెళ్లే ప్రధాన రోడ్డుపై భారీగా చేరిన నీరు



పల్లి గెడ్డ కల్వర్టును తాకుతూ ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తనీనది

తగరపువలస: అల్పపీడనం కారణంగా శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భీమిలి డివిజన్‌లోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా ప్రతిసారి వర్షాలకు జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు పరిధిలోని సంగివలస, సబ్బివానిపేట, ఆదర్శనగర్ గ్రామాలలో చేరినట్టే ఈ సారి కూడా భారీగా వర్షంనీరు సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు వాహనాలు నీటిలో నిలిచిపోగా తోసుకుంటూ వెళ్లడం కనిపించింది. చాలా వరకు వాహనాలు వెనుదిరిగి వెళ్లాయి. జాతీయరహదారిపై సైతం నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా కనిపించింది. టి.నగరపాలెం, అవంతి కళాశాల, మహరాజుపేట కూడళ్లలో కూడా సర్వీస్‌రోడ్డుపై వర్షంనీటి కష్టాలు వాహనదారులను వెంటాడాయి. సంగివలస చెరువు అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లోలలో లోపాల కారణంగానే ప్రతిసారి వర్షాలకు ఈ ప్రాంతంలో రహదారులపై నీరు నిలిచిపోతుందని, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్పారు.అలాగే సంగివలస కాలనీ, ఆదర్శనగర్, టీచర్స్ కాలనీలలో డ్రైనేజీలు లేని లోటు వర్షాకాలంలో కనిపిస్తుంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం సంగివలసలో ముంపునకు గురైన సర్వీస్‌రోడ్డు, ఫ్లై ఓవర్ ప్రాంతాలను సందర్శించారు.

ఆనందపురం మండలంలో..

మండలంలోని పలు పంచాయతీలలో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. స్థానికులు శ్రమదానం చేసి రోడ్లపై నిలిచిన నీటిని దారి మళ్లించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆనందపురం పంచాయతీ దొంతలవారి కల్లాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

గోస్తనీనదికి పోటెత్తిన వరదనీరు

గోస్తనీనదిలోకి వరదనీరు వచ్చి చేరింది. విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్‌లోకి నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో ఆనందపురం, భీమిలి తహసీల్దార్లు శ్యామ్‌ప్రసాద్, పైలా రామారావు గోస్తనీనది తీరప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టారు. రిజర్వాయర్ నుంచి నీరు విడుదల అయితే గంభీరం రిజర్వాయర్‌కు నీరు పోటెత్తనున్నందున తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ గంభీరంతో పాటు బోనిలోని గోస్తనీనది వద్ద ఆదివారం స్థానికులతో మాట్లాడారు. మరోవైపు భీమిలి మండలంలోని టి.నగరపాలెం,తాటితూరు, మూలకుద్దు, పద్మనాభం మండలంలోని పాండ్రంగి, సామియ్యవలస గ్రామాలకు వరద ప్రమాదం పొంచి ఉంది.

కూలిన హైస్కూల్ ప్రహరి

ఆనందపురం జడ్పీహైస్కూల్ ప్రహరి కూలి పక్కనే పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలు, రిక్షా అందులో కూరుకుపోయాయి. ఇదే ప్రాంతంలో తెగిపడిన విద్యుత్ వైర్లను సిబ్బంది సకాలంలో సరిచేశారు.

బంగ్లామెట్టపై పొంచి ఉన్న ప్రమాదం

తగరపువలస: భారీ వర్షాల కారణంగా జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్టపై నుంచి జాతీయరహదారి వైపు సర్వీస్‌రోడ్డు మీదకు గ్రావెల్, రాళ్లు జారిపడుతున్నాయి. గతంలో జాతీయ రహదారుల విస్తరణ సమయంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మెట్ట ప్రాంతాన్ని అంచు వరకు తవ్వారు. దీంతో ఈ మెట్ట ప్రాంతంలో చాలా వరకు పేదల ఇళ్లు వాలు అంచున ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయి. ఆదివారం ఈ ఇళ్లను ఆనుకుని మెట్టపై నుంచి గ్రావెల్, రాళ్లు పడడంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించే వాహనదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేయాలని, జీవీఎంసీ మెట్టపై నివాసం ఉంటున్న ఇళ్లకు ప్రమాదాలు జరగకుండా రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు.

భీమిలిలో కంట్రోల్ రూం ఏర్పాటు

భీమునిపట్నం: భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రామారావు తెలిపారు. భీమిలి పరిధిలో ఆపదలో ఉన్నవారు 8933293450లో సంప్రదించాలన్నారు. తద్వారా తాము సాయం అందిస్తామని తెలిపారు. ఇదిలా వుండగా గోస్తని నదికి దగ్గరగా ఉన్న తోటవీధి ప్రాంతాన్ని ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి పరిశీలించారు. వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున దగ్గరలోని ప్రభుత్వ పాఠశాల, తుపాను షెల్టర్లను సిద్ధం చేశామన్నారు.

పొంగుతున్న వాగులు, గెడ్డలు

పద్మనాభం: తుపాను ప్రభావంతో జోరుగా కురుస్తున్నాయి. దీంతో గెడ్డలు, గోస్తని నదిలో వర్షపు నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. మద్ది జంక్షన్‌కు సమీపంలోని విజయనగరం-శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న పల్లి గెడ్డ కల్వర్టును వర్షపు నీరు తాకుతూ ప్రవహిస్తుంది. మద్ది గ్రామం సమీపంలోని గోస్తని నదిలో ఆనకట్టుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. విలాస్కాన్‌పాలెం లో మరికమ్మ చెరువు కింద సుమారు 15 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

లోతట్టు ప్రాంతాల జలమయం

కొమ్మాది: తీర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం రుషికొంత తీర ప్రాంత మత్స్యకారులు వేటకు స్వస్తి చెప్పారు. వలలు, బోట్లు తీరానికి పరిమితమయ్యాయి. రుషికొండ బీచ్‌లో బోటు షికారు నిలిపి వేశారు. పరదేశిపాలెం గెడ్డ పెద్ద ఎత్తున వరద ప్రవహించడంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గాలి వర్షంతో తీర ప్రాంతాల్లో పలు చోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.

ఎడతెరిపి లేని వర్షంతో అవస్థలు

మధురవాడ: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు మధురవాడ పరిసర ప్రాంతాలులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం పూర్తిగా స్తంభించింది. కాలువలు, గెడ్డల్లోకి నీరు సరిగా పారక పోవడంతో పరదేశిపాలెం నీరు నిలిచిపోయింది. మధురవాడ బస్ స్టాప్ వద్ద, అప్ బ్రిడ్జి, డైలీ మార్కె ట్, చంద్రంపాలెం వద్ద రోడ్డుపై నీరు చేరింది.



కూలిన ప్రహరీ

వర్షాలకు కూలిన ప్రహరీ

కొమ్మాది: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు 8వ వార్డు ఎండాడ దరి గణేష్‌నగర్ కొండవాలు ప్రాంతంలో ఓ ఇంటి ప్రహరీ కూలిపోయింది. ఈ క్రమంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదిలా వుండగా జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వర్షాలకు నీటి మట్టం పెరగటం వలన గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఈ క్రమంలో కాపులుప్పాడ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



సంగివలస ఫ్లై ఓవర్ కింద భారీగా చేరిన నీరు

కోతకు గురైన బీచ్ రోడ్డు గట్టు



బోయివీధి సమీపంలో కోతకు గురైన బీచ్ గట్టు

భీమునిపట్నం: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం బీచ్‌రోడ్డుల గట్టు కోతకు గురైంది. బోయి వీధివరకు ఉన్న గట్టు అలల తాకిడి కోతకు గురైంది. తగరపువలసకు వెళ్లే మార్గంలో గెడ్డ నుంచి నీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి రావడంతో చెరువులా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.



మధురవాడ బస్టాప్ వద్ద చేరిన వర్షం నీరు



పరదేశిపాలెం గెడ్డపై పొంగుతున్న వరద



సర్వీస్ రోడ్డుపైకి జారి పడుతున్న రాళ్లు



వుడా మైదానంలో భారీగా నిలిచిన నీరు

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

పీఎంపాలెం: ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను 24 గంటల్లో పట్టుకున్నారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైమ్ ఏసీపీ కె. వెంకటరావు వివరాలు వెల్లడించారు. కారుషెడ్ కూడలిలోఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో మాకిరెడ్డి సీతామహాలక్ష్మి, ఆమె కుమారుడు ప్రదీప్ నివసిస్తున్నారు. ఆమె సొంత ఊరు నర్సీపట్నంలోని వాడపాలెం వెళ్లి ఈ నెల 6వ తేదీన విశాఖ బస్‌స్టేషన్‌లో దిగింది. ముగ్గురు మహిళలున్న షేర్ ఆటో ఎక్కి ఆశీలమెట్టలో దిగి..మరో ఆటోలో కారుషెడ్ కూడలికి చేరుకుంది. అయితే హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మర్చిపోయింది. బ్యాగులో బంగారు ఆభరణాలు, రూ.50వేలు ఉన్నాయి. 7వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురు మహిళలపై అనుమానం వ్యక్తం చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలు ఇచ్చిన క్లూ ఆధారంగా ఇటువంటి నేరాలలో పేరు మోసిన వడ్డాది మాడుగులకు చెందిన గాదె సత్యవతిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరం అంగీకరించింది. ఆమె ఆటోలో ప్రయాణిస్తూ కాజేసిన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు రూ. 50 వేలు నగదు స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని ఏసీపీ తెలిపారు. కేసును ఛేదించిన క్రైమ్ విభాగం పోలీసులను ఆయన అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ ఏసీపీ వెంకటరావు

గాయపడిన వృద్ధుడు మృతి

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో మద్యం మత్తులో ఓ వృద్ధుడు శనివారం సైడు కాలువ దాటుతుండగా ప్రమాదవ శాత్తు కాలుజారి గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. విజయరాంపురం గ్రామానికి చెందిన బొడ్డు సూర్యనారాయణ(74) శనివారం సాయంత్రం మద్ది పంచాయతీ తునిపాలంలో ఉన్న తన కుమార్తెలు ఇంటి వెళ్లాడు. కుమార్తెలను చూసి అదే రోజు తన ఇంటికి బయలుదేరాడు. ఇంటికి సమీపంలో సైడు కాలువా దాటుతుండగా కాలు జారి కాలువలో పడిపోయాడు. తలకు గాయాలవ్వడంతో 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.



సూర్యనారాయణ (ఫైల్)


గణపతి బప్పా మోరియా

వినాయకచవితి సందర్భంగా వివిధ రూపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. నియోజకవర్గవ్యాప్తంగా వినాయకచవితి వేడుకలు అంబరాన్నంటాయి. భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిపూజ అనంతరం రెండుపూటలా భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మండపాల వద్ద కాస్త ఇబ్బందులు నెలకొన్నా ఉత్సాహంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. చంద్రపాలెంలో 33 అడుగుల విగ్రహం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.


–తగరపువలస/భీమునిపట్నం/కొమ్మాది/పీఎంపాలెం/పద్మనాభం/మధురవాడ



మధురవాడ : చంద్రంపాలెంలో 33 అడుగుల గణనాథుని విగ్రహం



పీఎం పాలెం : పాత పీఎం పాలెంకు వెళ్లే రోడ్డులో గణనాథుడు



మధురవాడ : పరదేశిపాలెం బోరవారి వీధిలో విష్ణుమూర్తి అవతారంలో వినాయకుడు



కొమ్మాది : భువనేశ్వర్ కాలనీలో పూజలందుకున్న వినాయకుడు



తగరపు వలస : పెదనాగమయ్యపాలెంలో మహాదేవుని రూపంలో గణపయ్య



కొమ్మాది : మంగమారిపేటలో పూజలు అందుకున్న వినాయకుడు



పద్మనాభం : మద్దిలో రచ్చబండ దగ్గర నిలిపిన వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు



పద్మనాభం : గెడ్డపేటలో గణనాథుడి విగ్రహం



భీమిలి : బోయివీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ



తగరపు వలస : చిల్లపేటలో మూషికంపై కొలువుతీరిన గణనాథుడికి పూజలు భక్తులు



మధురవాడ : గణేష్‌నగర్‌లో కొలువుదీరిన 14 అడుగుల లంబోధరుడు



మధురవాడ: ఎండాడ పనోరమ హిల్స్‌లో గల సెలబ్రిటీ టవర్స్ గృహ సముదాయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు



భీమిలి : అప్పికొండవీధి భీమిలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం